సాక్షి పల్నాడు

ఆదివారం । 20 । ఏప్రిల్ । 2025



కుంకుమ పూజలు

బాపట్ల: బాపట్ల అధిష్టాన దేవత శ్రీ పోలేరమ్మ అమ్మవారి దేవాలయం వద్ద శనివారం అంత్యంత వైభవంగా సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.



అధిక బరువుపై అవగాహన

తెనాలి: పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా తెనాలిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశాలను జరిపారు. పిల్లల్లో అధిక బరువుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లులకు వివరించారు.



యునెస్కో గుర్తింపుపై హర్షం

కూచిపూడి: యునెస్కో నాట్య శాస్త్రాన్ని గుర్తించిందని కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ వెల్లడించటంతో కూచిపూడి కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

న్యూస్‌రీల్

సబ్ జైలును సందర్శించిన న్యాయమూర్తి



నరసరావుపేటటౌన్: స్థానిక ప్రత్యేక ఉపకారాగారాన్ని శనివారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి టి. ప్రవళిక సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రిమాండ్ ఖైదీలు ఉచిత న్యాయ సహాయం పొందే విధివిధానాలను వివరించారు. బెయిల్ లభించి జామీనదారులను పెట్టుకునే స్తోమత లేని వారి వివరాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆ రోజువారి జీవితంలో అవసరమయ్యే అనేక చట్టాలను వివరించారు. కార్యక్రమంలో సబ్ జైల్ సూపరింటెండెంట్ రవికుమార్ యాదవ్, ప్యానల్ న్యాయవాది, సిబ్బంది పాల్గొన్నారు.

ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన



వినుకొండ: మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరునాళ్ల సందర్భంగా మక్కెన చినరామయ్య ఆడిటోరియంలో జాతీయ ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శన పోటీలు కొనసాగుతున్నాయి. నాలుగ పళ్ల సైజు విభాగంలో 10 జతలు పాల్గొన్నాయి. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు మక్కెన వెంకట్రావు, అనుమాల సుబ్బారెడ్డి, మదాల చిరంజీవి, కుంటా కోటిరెడ్డి, జగ్గరెడ్డి, అక్కిరెడ్డి, రొడ్డా నాగిరెడ్డి, జక్కిరెడ్డి కోటిరెడ్డి, జక్కిరెడ్డి, నాగిరెడ్డి, గురువారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలలు యూడైస్‌లో రిజిస్టర్ కావాలి

నరసరావుపేట ఈస్ట్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 1వ తరగతి ఉన్న అన్ని ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేద విద్యార్థులకు కేటాయించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం తెలిపారు. ప్రభుత్వం ఆర్‌టీఈ 12 (1)సీ ఉత్తర్వులు ఇచ్చినందున జిల్లాలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు cre.ap.gov.in పోర్టల్‌లో యుడైస్ యూజర్ ఐడి, పాస్‌వర్డ్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. దానిలో పాఠశాల గుర్తింపు కాపీని అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈనెల 19వతేది నుంచి 25వతేదీలోగా రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

ఇద్దరు ఉపాధ్యాయుల సస్పెన్షన్

గుంటూరు ఎడ్యుకేషన్: నల్లచెరువులోని అంబేడ్కర్ ఎయిడెడ్ పాఠశాలలో సర్దుబాటుపై పని చేస్తున్న ఇద్దరు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు జాకీర్ హుస్సేన్, డి.రవిని సస్పెండ్ చేస్తూ జిల్లా విద్యాశాఖాధికారి సీవీ రేణుక శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. విధుల్లో నిర్లక్ష్యం, విద్యార్థుల హాజరు నమోదులో అవకతవకలు, మధ్యాహ్న భోజనం చేస్తున్న విద్యార్థుల సంఖ్యను పెంచి చూపడం, సరైన రికార్డులను నిర్వహించకపోవడం వంటి అంశాలపై ఎంఈఓ, డీవైఈఓలతో విచారణ జరిపించిన డీఈఓ రేణుక వారి నివేదిక ఆధారంగా సంబంధిత ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. పాఠశాలను డీఈఓ రేణుక తనిఖీ చేసిన సమయంలో 46 మంది విద్యార్థులను ఆన్‌లైన్ హాజరులో నమోదు చేయడం, తీరా పాఠశాలలో భౌతికంగా హాజరైన విద్యార్థులు తొమ్మిది మందే ఉండటంపై విచారణకు ఆదేశించారు. దీనిపై రెండు రోజుల క్రితం డీవైఈవో, ఎంఈవో పాఠశాలకు స్వయంగా వెళ్లి, సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇచ్చారు.

గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులకు తాత్కాలిక సీనియార్టీ జాబితా

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జోన్ పరిధిలోని ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో ప్రభుత్వ యాజమాన్యంలో పని చేస్తున్న స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెచ్ఎం పోస్టులకు అర్హులైన వారితో తాత్కాలిక సీనియార్టీ జాబితాను విడుదల చేసినట్లు ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రెండోసారి విడుదల చేసిన సీనియార్టీ జాబితాలను

httpr//doeguntur.blogspot.com,
httpr//doenellore.50webs.com,
www.prakasamschooledu.com

సైట్‌లలో సందర్శించి, ఏవైనా అభ్యంతరాలు ఉంటే సంబంధిత జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో తగిన ఆధారాలతో ఈనెల 22లోపు సమర్పించాలని సూచించారు.



దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌కి బేడీలతో తాళాలు వేసిన దృశ్యం (ఫైల్)

బేడీల భాస్కర్

వివాదాల సీఐ

- రెడ్‌బుక్ అమలుకు అడ్డదారులు
- దాచేపల్లి సీఐ పొన్నూరు భాస్కరరావు దౌర్జన్యాలు అనంతం
- వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులే టార్గెట్ గా అక్రమ కేసులు, వేధింపులు
- ప్రైవేటు కేసులు వేసిన బాధితులు
- సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణి విషయంలోనూ అదే తీరు
- ఆమెను పరామర్శించేందుకు ఎవరూ రాకుండా పోలీసు స్టేషన్ గేట్‌కు బేడీలు
- గురజాల మేజిస్ట్రేట్ ముందు సీఐకి వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇచ్చిన కృష్ణవేణి
- పచ్చ పార్టీ నేతల మద్దతుతో అవినీతిలో రెచ్చిపోతున్న ఖాకీ

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : ఆ సీఐ ఎప్పుడూ వివాదాల్లోనే మునిగి తేలుతుంటాడు. గతంలో ఒక స్టేషన్‌లో పని చేసినప్పుడు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను చావబాది అనేక ఆరోపణలు ఎదుర్కొని హైకోర్టులో ప్రైవేట్ కేసు ఫైల్ చేసే వరకు వివాదం వెళ్లింది. అక్కడి నుంచి అదే నియోజకవర్గంలోని మరో స్టేషన్‌కు బదిలీ అయినా తీరుమారలేదు. అక్కడా ఇంతే... ఏకంగా ఆయన వేధింపులపై కోర్టులో స్టేట్ మెంట్ రికార్డ్ చేశారంటే పరిస్థితి ఏంటో అర్థమవుతుంది. నా రూటే సపరేట్ అంటూ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేయటమే లక్ష్యం అంటూ ఆ సీఐ పనిచేస్తున్నారు. టీడీపీ ముఖ్యనేతల ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టి జైలుకి పంపించటం ఆయన నైజం. పైకి ఖాకీ యూనిఫాం వేసుకున్న లోపల మాత్రం పసుపు చొక్కా ధరించిన పచ్చ కార్యకర్తలాగా పని చేస్తుంటారు. తీసుకునేది ప్రభుత్వ జీతమే కానీ ఆయన పని చేసేది మాత్రం అధికారపార్టీ నేతల కోసమే అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ నేతలను స్టేషన్‌కి కూడా రావొద్దని బహిరంగానే చెప్పి తన స్వామిభక్తిని చాటుకుంటున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి పోలీస్‌స్టేషన్ సీఐ భాస్కరరావు వ్యవహారం ఇప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. నిత్యం వివాదాలతో సంచనాలకు కేంద్ర బిందువుగా నిలుస్తున్నారు.



కె భాస్కరరావు, దాచేపల్లి సీఐ

సొంత స్టేషన్‌కు బేడీలు వేసిన ఘనుడు

దాచేపల్లి వచ్చినా భాస్కర్ తీరులో ఆవగింజంత మార్పు కూడా లేదు. మీడియానూ స్టేషన్ కు రానివ్వడం లేదంటే భాస్కర్ ఎంత బరితెగించారో అర్థమవుతోంది. ఎవరైనా స్టేషన్‌కు వెళ్లాలంటే వణికిపోతున్నారు. దీంతోపాటుగా భాస్కర్‌పై ఆర్థిక వ్యవహారాల విషయాల్లో అనేక ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న మీడియాలో వరుస కథనాలు వస్తున్నా ఆయనపై చర్యలు మాత్రం శూన్యం. తాజాగా సోషల్ మీడియా యాక్టివిస్ట్ పాలేటి కృష్ణవేణిని హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి దాచేపల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. కృష్ణవేణి బంధువులతోపాటు ఆమె న్యాయవాదులు కలవడానికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. కానీ పోలీస్ స్టేషన్లోకి ఎవరూ రాకూడదని సీఐ భాస్కర్ ఆదేశించారు. దీంతో సిబ్బంది పోలీస్ స్టేషన్ గేట్లు వేసి తాళం బదులు బేడీలు వేశారు. ఏకంగా పోలీస్ స్టేషన్‌కు బేడీలు వేసిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బేడీల భాస్కర్‌గా సీఐ గుర్తింపు పొందారు. ఇంత జరిగినా పోలీస్ ఉన్నతాధికారులు స్టేషన్‌కు బేడీలు వేయడమేంటని కూడా ప్రశ్నించలేదు. స్టేషన్‌లో ఉన్న కృష్ణవేణిని కలవడానికి ఉన్నతాధికారుల నుంచి ఫోన్లు చేయించుకుంటే కానీ సీఐ భాస్కర్ ఒప్పుకోలేదంటే ఆయన వ్యవహారం ఎలా ఉందో అర్థమవుతోంది. అరెస్ట్ చేసిన కృష్ణవేణిని గురజాల కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సమయంలో కృష్ణవేణి సీఐపై న్యాయమూర్తికి ఫిర్యాదు చేసినట్టు ఆమె న్యాయవాదులు చెబుతున్నారు. మానసికంగా తీవ్రంగా హింసించారని కృష్ణవేణి చెప్పినట్టు తెలుస్తోంది. మేం చెప్పినట్లు వినకపోతే రాష్ట్రవ్యాప్తంగా కేసులు నమోదవుతాయని, ఆ కేసుల్లో రాష్ట్రం మొత్తం తిప్పుతామని బెదిరించినట్లు న్యాయమూర్తికి కృష్ణవేణి వాంగ్మూలం ఇచ్చినట్టు న్యాయవాదులు చెబుతున్నారు. అంతే కాదు తాను చెప్పింది చెయ్యకపోతే కృష్ణవేణి భర్త రాజ్ కుమార్‌పై గంజాయి కేసు పెడతామని కూడా సీఐ బెదిరించినట్లు న్యాయమూర్తి ఎదుట బాధితురాలు కన్నీరుమున్నీరైనట్టు సమాచారం. దీంతో కృష్ణవేణి వాంగ్మూలాన్ని న్యాయమూర్తి రికార్డ్ చేసినట్టు ఆమె తరపు న్యాయవాదులు తెలిపారు. సీఐ భాస్కర్‌పై చార్జి మెమో జారీ చేసి, దీనిపై వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసినట్టు తెలుస్తోంది.

వైఎస్సార్‌సీపీ నేతలే టార్గెట్

ఐదు నెలల క్రితం వరకు గురజాలలో సీఐగా భాస్కరరావు పనిచేశారు. అక్కడ ఉన్న సమయంలో భాస్కర్‌పై ఎన్నో ఆరోపణలు ఉన్నాయి. ఎమ్మెల్యే యరపతినేని ఏరికోరి తెచ్చుకున్న వ్యక్తి సీఐ భాస్కర్. యరపతినేని ఏం చెబితే అది చేస్తారు. ప్రభుత్వం మారినప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి మరీ దాడులు చేయడం, వారిపై అక్రమ కేసులు బనాయించడం గురజాలలో రొటీన్‌గా మారింది. ఇందుకు సీఐ పూర్తి సహాయ, సహకారాలు ఉంటున్నాయి. వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా ఉండే నాయకులను టార్గెట్ చేయడం, వారిని పోలీస్ స్టేషన్ కు పిలిపించడం, చావబాదడం.. ఇదే గురజాలలో జరిగిన వ్యవహారం. ఎవరైనా వైఎస్సార్‌సీపీ నేతలు ఎందుకు తమ వాళ్లను స్టేషన్ కు తీసుకొచ్చారని అడగడానికి వెళితే గెటవుట్ అంటారు.. పోలీస్ స్టేషన్‌కు మీరు రాకూడదు.. ఎందుకు వచ్చారంటూ ఆగ్రహించడం సీఐ స్టైల్. వైఎస్సార్‌సీపీ నేతలపై వేధింపులు, అక్రమ కేసుల వ్యవహారంపై మీడియాలో కథనాలు రావడంతో సీఐ భాస్కర్‌ను గురజాల నుంచి బదిలీ చేశారు. అయితే యరపతినేని ఆశీస్సులు పుష్కలంగా ఉండడంతో అదే నియోజకవర్గంలో పక్క స్టేషన్ అయిన దాచేపల్లికి సీఐగా పోస్టింగ్ దక్కించుకున్నారు. ఇక్కడ కూడా అదే పరిస్థితి. పోలీస్ స్టేషన్ అంటే తన సొంతమని భావించి తాను చెప్పిందే చేయాలన్నట్లుగా వ్యవహరించడం మొదలుపెట్టారు సీఐ భాస్కర్.

హైకోర్టులోనూ కేసులు

ఇదిలా ఉండగా పచ్చనేతల అడుగులకు మడుగులు ఒత్తుతూ.. వైఎస్సార్‌సీపీ నేతలను గ్రామాల్లో ఉండకుండా చేస్తున్న సీఐ భాస్కరరావు వ్యవహారశైలి పోలీస్ వ్యవస్థకే మాయనిమచ్చగా ఉంది. సీఐ భాస్కరరావు చేతిలో దెబ్బలు తిన్న.. బెదిరింపులకు గురైన వైఎస్సార్‌సీపీ నేతలు ఆయనపై హైకోర్టులో కేసులు వేశారు. గురజాల, దాచేపల్లికి చెందిన నేతలు ఆయనపై మూడు కేసులు హైకోర్టులో వేశారు. సీఐ భాస్కరరావు బారినుంచి తమను కాపాడాలని బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులు ప్రస్తుతం విచారణ దశలో ఉన్నాయి. ఆయన అవినీతిపై సొంత పార్టీ నేతలే విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కూటమి పార్టీలకు అనుకూలంగా వ్యవహరించే మీడియాలోనూ ఆయన అవినీతిపై వ్యతిరేకంగా వార్తలు వస్తున్నాయంటే ఆయన వ్యవహారశైలి ఏంటో అర్థం చేసుకోవచ్చు. అయినా సదరు సీఐపై చర్యలకు ఉన్నతాధికారులు ఎందుకు వెనుకాడుతున్నారో అర్థం కావడంలేదని పోలీసు వర్గాలు చర్చించుకుంటున్నాయి.

విచారణ ఎదుర్కోవాల్సిందే



దాచేపల్లి సీఐ భాస్కరరావు చేస్తున్న అక్రమాలు, అన్యాయాలను వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వైఎస్సార్‌సీపీ నేతలను టార్గెట్ చేసి తప్పుడు కేసులు పెట్టి ఇరికిస్తున్నారు. సొంత స్టేషన్‌కే బేడీలు వేసిన సీఐని నా రాజకీయ జీవితంలో నేను ఎప్పుడూ చూడలేదు. రెడ్‌బుక్ అమలు చేయటమే సీఐ భాస్కరరావు చేస్తున్న ఉద్యోగం. వచ్చే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఐ భాస్కరరావుపై విచారణ తప్పక జరుగుతుంది. అన్నిటికీ ఆయన సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది.

– కాసు మహేష్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే

క్రమ'బద్ధకం'

ఏళ్ల తరబడి నిలువ నీడ లేక ప్రభుత్వ భూముల్లో నాలుగు రేకులు కప్పుకుని జీవనం సాగిస్తోన్న కుటుంబాల వేదన అంతాఇంతా కాదు. ఇంటిలో ఉంటున్నామనేగానీ సొంతమనే భావన లేక దిగులు జీవితాలు గడుపుతున్నారు. ఈ క్రమంలో వచ్చిన జీవో 30 తమ సొంతింటి కలలకు ఆశల వారధిగా మారుతుందని భావించిన నిరుపేదలకు అధికారుల అలసత్వం శాపంగా మారింది. ఆక్రమిత భూముల్లో ఇళ్ల క్రమబద్ధీకరణకు అధికారుల బద్ధకం అడ్డుకట్టగా నిలుస్తోంది.

- జీవో 30 అమలుపై అధికారుల అలసత్వం
- ఆక్రమిత స్థలాలపై ఉచిత రిజిస్ట్రేషన్‌కు అవకాశం
- అవగాహన కల్పించని వైనం
- పేదలకు తీవ్ర అన్యాయం
- నరసరావుపేటలో ఇప్పటి వరకు 14 దరఖాస్తులే
- ఈ ఏడాది చివరి వరకు అవకాశం ఉందన్న నరసరావుపేట తహసీల్దార్

నరసరావుపేట టౌన్:నరసరావుపేట పట్టణంలోని అనేక ప్రాంతాల్లో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు లేకపోవడంతో ప్రభుత్వ భూముల్లో కాస్తంత రేకులు, పూరిళ్లు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇలా నరసరావుపేటలోని పెద చెరువు, బాపనయ్య నగర్, బీసీ కాలనీ, బరంపేట, క్రిస్టియన్ పాలెం తదితర ప్రాంతాల్లో వీరు అధికంగా ఉన్నారు. అలాంటి వారు ఏళ్ల తరబడి రెగ్యులేషన్ కోసం ప్రభుత్వం వద్ద విన్నపాలు చేస్తూనే ఉన్నారు. అయితే కొద్ది నెలల క్రితం ప్రభుత్వం జీవో నంబర్ 30 విడుదల చేసింది. పేదలకు ప్రభుత్వ భూములపై క్రమబద్ధీకరణ ద్వారా అస్తిత్వాన్ని కల్పించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఈ జీవో కాగితాలకే పరిమితమై పేదలకు స్వాంతన చేకూరడం లేదు. జీవో ప్రకారం 150 గజాల వరకు ఉన్న స్థలాలకు ఉచితంగా పట్టాలు ఇచ్చే అవకాశం కల్పించినా ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

విస్తీర్ణం (గజాల్లో)	చెల్లించాల్సింది	రిజిస్ట్రేషన్ ఛార్జీలు
150(లోపు)	ఉచితం	ఉచితం
151-300విలువలో	15 శాతం	50 శాతం
301-450విలువలో	100 శాతం	50 శాతం



నరసరావుపేట తహసీల్దార్ కార్యాలయం

అవగాహన ఎక్కడ ?

ప్రజల్లో ఆసక్తి లేకపోవడం కంటే ఎక్కువగా అధికారులు సరైన అవగాహన కల్పించకపోవడం దీనికి ప్రధాన కారణమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. సంవత్సరాలుగా ప్రభుత్వ భూముల్లో నివాసాలు నిర్మించుకుని పక్కా గృహాలతో జీవిస్తున్న వారు పట్టాల కోసం అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ''కాసులిస్తేనే పనులు జరిగే రోజుల్లో ఉచితంగా ఈ పథకం అమలు అయ్యేనా?'' అన్న అనుమానాలు ప్రజల్లో నాటుకుపోయాయి.

ఎవరెవరు అర్హులు?

ఈ పథకం ద్వారా లబ్ధి పొందాలనుకునే వారు మీసేవా కేంద్రాలు, వార్డు/గ్రామ సచివాలయాల ద్వారా దరఖాస్తు చేయవచ్చు. ఆధార్, రేషన్, ఓటరు కార్డు వంటి గుర్తింపు పత్రాలు, స్థలానికి సంబంధించిన ఆధారాలు, ఆస్తి పన్ను, నీటి పన్ను, విద్యుత్ బిల్లులు తదితర డాక్యుమెంట్లను సమర్పించాలి. రెవెన్యూ సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి, అక్రమంగా స్థలాన్ని 2019 అక్టోబర్ 15వ తేదీకి ముందు ఆక్రమించి ఇల్లు కట్టుకున్నారా? వార్షిక ఆదాయం ఎంత? వంటి అంశాలపై పరిశీలన జరిపి అర్హతను నిర్ణయిస్తారు.

ఇప్పటివరకు 14 దరఖాస్తులు వచ్చాయి

క్రమబద్ధీకరణ కోరుతూ నరసరావుపేట మండలం రూరల్ పరిధిలో 1, పట్టణ పరిధిలో 13 దరఖాస్తులు వచ్చాయి. ఏడాది డిసెంబర్ 31వ తేదీ వరకు దరఖాస్తులకు చివరి తేదీ. అర్హులు ఉంటే దరఖాస్తు చేసుకోవాలి.

వేణుగోపాల్, తహసీల్దార్, నరసరావుపేట

'మంట'చింతల

రెంటచింతలలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రత

రెంటచింతల: వేసవిలో మంటచింతలగా ప్రసిద్ధిచెందిన రెంటచింతల నిప్పుల కొలిమిగా భగభగ మండుతోంది. రెండు తెలుగు రాష్ట్రాలలో ఏటా వేసవికాలంలో ఏరోజు ఎండ ఎక్కువ కాసినా రెంటచింతల ఉష్ణోగ్రత ఎంత అని అడగడం సహజం. గురువారం గ్రామంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 28.6 డిగ్రీలుగా నమోదైనట్లు వాతావరణ అధికారులు తెలిపారు. కొద్ది రోజులుగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో గ్రామస్తులు అల్లాడుతున్నారు. వృద్ధులు, బాలింతలు, చిన్నారులు, గర్భిణుల అవస్థలు వర్ణనాతీతం. గ్రామస్తులు ఉదయం పదిగంటలు దాటితే బయటకు రాలేని దుస్థితి నెలకొంది. కొబ్బరిబొండాలు, చెరుకురసం వంటి శీతలపానీయాలతో కొంతవరకు ఉపశమనం పొందుతున్నారు. వ్యవసాయ, వివిధ పనులకు వెళ్ళే కూలీలు ఎండతీవ్రత తట్టుకోలేక 11.30 గంటలకల్లా ఇంటిముఖం పడుతున్నారు.



ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రభుత్వానికి అందజేయండి

సేకరించే స్టాల్‌ను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యే



కలెక్టరేట్‌లో సేకరించిన ఈ వేస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ, అధికారులు

నరసరావుపేట: పర్యావరణానికి ముప్పుగా పరిణమించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను ప్రభుత్వానికి అందజేయాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. ఈ మేరకు పట్టణంలోని స్టేషన్‌రోడ్డు గాంధీపార్కు వద్ద ఈ-చెక్ అనే థీమ్‌తో స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ-వ్యర్థాల సేకరణ స్టాల్‌ను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా ప్రజల నుంచి ఇళ్లు, హాస్పిటళ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థల నుంచి పర్యావరణానికి హాని కలిగించేందుకు ఉత్పన్నమయ్యే కంప్యూటర్లు, టీవీలు, రేడియో, మొబైల్ ఫోన్‌లు, వాషింగ్ మిషన్లు, మైక్రో ఓవెన్లు, సీడీ ప్లేయర్లు, ఫ్యాన్లు తదితర వస్తువులను సేకరించారు. అలాగే మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టాల్‌ను సందర్శించి అందులోని ఉత్పత్తులను పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఈ-థీమ్‌పై సేకరించిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యర్థాలపై ప్రభుత్వం పోరాడుతుందన్నారు. సేకరించిన వీటిలోని పనికివచ్చే వాటిని మహిళా సంఘాలకు ఇచ్చిన శిక్షణతో వేరుచేసి మిగతా వేస్ట్‌ను శాస్త్రీయంగా నిర్మూలించటం జరుగుతుందన్నారు. దీని వలన చాలామందికి ఉపాధి లభిస్తుందన్నారు. రిపేరుచేసే షాపుల్లో పనికిరాని వాటిని వ్యాపారులు తెచ్చి ఇవ్వచ్చన్నారు. స్థానిక ఎమ్మెల్యే సహకారంతో స్వచ్ఛాంధ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామన్నారు. దీనిలో జేసీ సూరజ్ గనోరే, డీఆర్వో ఏకా మురళి, ఆర్డీవో కె.మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు, ఆర్అండ్‌బీ ఈఈ రాజానాయక్ అధికారులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాల్లో విద్యార్థి ప్రతిభ



వినుకొండ: జేఈఈ మెయిన్ పరీక్ష ఫలితాల్లో వినుకొండ విద్యార్థి కాలువ లీల వెంకటసాత్విక్ 99.92 పర్సంటైల్ సాధించి ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరిలో 1276 ర్యాంక్ సాధించారు. ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షల్లోనూ 985 మార్కులు సాధించారు. సాత్విక్ తండ్రి వెంకటనారాయణ ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలంలో ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. తల్లి కృష్ణకుమారి పట్టణంలోని ఒక ప్రైవేటు పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు. సాత్విక్ మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్‌లో మంచి ర్యాంక్ సాధించి ఇండియాలో ఉన్న ప్రతిష్టాత్మక ఐఐటీ కాలేజీల్లో సీటు సాధించడమే తన లక్ష్యమని పేర్కొన్నారు. సాత్విక్‌కు తల్లిదండ్రులు, స్నేహితులు, అధ్యాపకులు, బంధువులు అభినందనలు తెలిపారు.

లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పే అంతిమం

- న్యాయసేవాధికార కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్‌రెడ్డి
- జాతీయ లోక్ అదాలత్‌పై పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష



పోలీసు అధికారులతో సమీక్ష చేస్తున్న న్యాయమూర్తులు విజయ్‌కుమార్‌రెడ్డి, తౌషిద్ హుస్సేన్, ప్రియదర్శిని, మహ్మద్ గౌస్

సత్తెనపల్లి: రాజీ మార్గమే రాజ మార్గమని, లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు (అవార్డ్) అంతిమ తీర్పు అని సత్తెనపల్లి మండల న్యాయసేవాధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెటింగ్ యార్డు ఆవరణలో గల సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో ఏప్రియల్ 10వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం పోలీసు, రెవెన్యూ అధికారులతో సమీక్ష చేశారు. సీనియర్ సివిల్ జడ్జి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ సత్తెనపల్లి న్యాయస్థాన పరిధిలో ఉన్న అన్ని కోర్టుల్లో ఉన్న రాజీ పడదగిన కేసులలో ఎక్కువగా రాజీ అయ్యేలా చూడాలన్నారు. ముందుగా ఆయా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న క్రిమినల్ కేసులు? రాజీ పడదగిన కేసులు? ఎన్ని ఉన్నాయి అనే దానిపై, అన్ని అంశాలపై ఆయా పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలతో సమీక్ష నిర్వ హించారు. సమీక్షలో సత్తెనపల్లి రూరల్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సుబ్బారావు, మిగిలిన పోలీస్‌స్టేషన్‌లలో ఎస్‌ఐలు పాల్గొన్నారు. అనంతరం సత్తెనపల్లి న్యాయస్థాన పరిధిలో ఉన్న అన్ని మండలాల తహసీల్దార్ లతో సివిల్ వివాదాలు, తదితర అంశాలపై మాట్లాడారు. సత్తెనపల్లి ఏజీపీ షేక్ బాలి సైదా, సత్తెనపల్లి ఆర్డీఓ కార్యాలయం నుంచి ఏవో సరోజిని, అన్ని మండలాల తహసీల్దార్‌లు పాల్గొన్నారు. ఈ రెండు సమీక్షలలో ప్రధాన సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఏ.తౌషీద్ హుస్సేన్, ఒకటో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) పి.ప్రియదర్శిని, రెండో అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) మహ్మద్ గౌస్, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, ఉన్నారు.

విద్యతోపాటు మహిళల అభివృద్ధిలో భాగస్వామి



బి.బబితను సన్మానిస్తున్న నిర్వాహకులు

పిడుగురాళ్ల: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విద్యతోపాటు మహిళల అభివృద్ధికి కూడా భాగస్వామి అవుతుందని సీఎస్‌ఆర్ డైరెక్టర్ బి.బబిత అన్నారు. పట్టణ శివారులోని కొండమోడులో ఏర్పాటు చేసిన ఉచిత జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఆమె మాట్లాడుతూ ఉచిత శిక్షణ పొందిన మహిళలకు ధ్రువీకరణ పత్రాలను అందజేయటం జరుగుతుందని పేర్కొన్నారు. శిక్షణను వదిలేయకుండా మహిళలు స్వయం ఉపాధికి ఉపయోగించుకోవాలని ఆమె కోరారు. ఈ నెల రోజుల శిక్షణ తరగతులు 15 రకాల ఉత్పత్తులను శిక్షణ ద్వారా తయారు చేయటం నేర్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మండూరు వెంకటరమణ, శిక్షకురాలు పి.దుర్గా, పీఎస్‌ఆర్ డిగ్రీ కాలేజీ డైరెక్టర్లు కె.నరసింహారావు, బాడిన మస్తాన్ పాల్గొన్నారు.

భార్యపై బ్లేడుతో దాడిచేసిన భర్త అరెస్ట్

క్రోసూరు: క్రోసూరు బోయకాలనీలో శుక్రవారం భార్యపై అనుమానంతో బ్లేడుతో దాడి చేసిన భర్త చర్ల శ్రీనును పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ విధించినట్లు స్టేషన్ రైటర్ దాసు తెలిపారు.

26 నుంచి స్లాట్ల ద్వారా రిజిస్ట్రేషన్‌లు



అమరావతి: ఈనెల 26వ తేదీ నుంచి అమరావతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని అన్ని గ్రామాలలో పొలాలు, స్థలాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవటానికి స్లాట్ విధానం ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిందని అమరావతి సబ్ రిజిస్ట్రార్ పి.వెంకటరెడ్డి తెలిపారు. శనివారం ఆయన రిజిస్ట్రేషన్ స్లాట్ల విధానం గురించి వివరిస్తూ అమరావతి రిజిస్ట్రేషన్ కార్యాలయానికి రోజుకు 39 స్లాట్లను కేటాయించారని తెలిపారు. ఈ స్లాట్ల బుకింగ్ చేసుకోవటానికి ఆన్‌లైన్‌లో ఐజీఆర్‌ఎస్ స్లాట్‌లో బుకింగ్ చేసుకోవాలన్నారు. ప్రతిరోజు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు స్లాట్ బుకింగ్ చేసుకున్న వారికి రిజిస్ట్రేషన్‌లు చేస్తామన్నారు. అలాగే స్లాట్ బుకింగ్ చేసుకోని వారికి సాయంత్రం 5గంటల తర్వాత రిజిస్ట్రేషన్‌లు నిర్వహిస్తామన్నారు. ఈ స్లాట్ బుకింగ్ వల్ల కాలం వృథా కాకుండా క్రమ పద్ధతిలో రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయన్నారు. ప్రజలంతా ఈ రిజిస్ట్రేషన్ స్లాట్ విధానాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కంటైనర్

తమిళనాడుకు చెందిన డ్రైవర్‌కు తీవ్రగాయాలు



యడ్లపాడు: హైవే సెంట్రల్ డివైడర్‌పై మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను కంటైనర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..తమిళనాడు చెందిన కంటైనర్ గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు వస్తున్న క్రమంలో యడ్లపాడు మండలం బోయపాలెంలోని కళ్యాణ వెంకటేశ్వరస్వామి గుడి సమీపంలో హైవేపై మొక్కలకు నీళ్లు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుండి ఢీకొట్టింది. సాయంత్రం 4 గంటలకు జరిగిన ఈ ప్రమాదంలో కంటైనర్ లారీ ముందుభాగం పూర్తిగా ధ్వంసం కాగా, డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గమనించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

కార్మికుల పోరాటాన్ని పట్టించుకోకపోవటం దారుణం

- 31రోజులకు చేరిన పారిశుద్ధ్య కార్మికుల నిరసన దీక్షలు
- కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ



మాట్లాడుతున్న కేఎన్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి

నరసరావుపేట: ఆప్కాస్‌లో ఉన్న తమకు పనిచేసిన రోజులు అన్నింటికి జీతం చెల్లించాలని కోరుతూ 30 రోజులుగా పారిశుద్ధ్య కార్మికుల చేస్తున్న పోరాటాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట తమ డిమాండ్ల సాధనకోసం కార్మికులు చేస్తున్న నిరసన దీక్షలు శనివారంతో 31వ రోజుకు చేరాయి. శిబిరాన్ని కృష్ణ సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలియచేసి మాట్లాడారు. ప్రభుత్వం ఎవరికోసం పనిచేస్తుందో అర్థంకావట్లేదన్నారు. తాము అధికారంలోకి వస్తే అన్ని సమస్యలు తీరుస్తామని ప్రజలకు పలు వాగ్దానాలు చేసిన కూటమి నాయకులు తమకు నెలజీతం ఇప్పించమని కోరుతున్న కార్మికులవైపు చూడకపోవటం వారి నైజం తెలియచేస్తుందన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ సంఘం పూర్తిగా మద్దతు తెలియచేస్తుందన్నారు. వెంటనే అధికారులు కలుగచేసుకొని వారికి పూర్తిజీతంతో పాటు విధుల్లోకి తీసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు



పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

మార్కాపురం టౌన్: మార్కాపురం లక్ష్మీచెన్నకేశవస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్‌వీకేపీ కళాశాలలో జరుగుతున్న జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు 2వ రోజైన శనివారం ఉత్సాహంగా సాగాయి. పోటీలకు గుంటూరు, నంద్యాల, బాపట్ల, తెలంగాణలోని సూర్యాపేట, పల్నాడు, ప్రకాశం జిల్లాల నుంచి ఎడ్ల జతలు పోటీల్లో పాల్గొన్నాయి. శనివారం పోటీల్లో గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్దగొట్టిపాడు గ్రామానికి చెందిన జీఎల్ఆర్ గ్రూప్స్, గరికపాటి లక్ష్మయ్యచౌదరిలకు చెందిన ఎడ్ల జత 4351.06 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతిని, నంద్యాల జిల్లా పెద్దకొట్టాలకు చెందిన బీ కేశవరెడ్డికి చెందిన ఎడ్ల జత 4325.09 అడుగుల దూరంలాగి రెండో స్థానాన్ని, బాపట్ల జిల్లా వేటపాలెం మండలం చుండూరుకు చెందిన ఆర్‌కె బుల్స్, శిరీషా చౌదరికి చెందిన ఎడ్ల జత 4291.10 అడుగులు లాగి మూడో బహుమతిని, తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన జే సహస్రయాదవ్, జేవీఎల్ యాదవ్‌కు చెందిన ఎడ్ల జత 3881.10 అడుగులు లాగి 4వ స్థానాన్ని సాధించాయి.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ప్రేమయ్య ఎంపిక



ఇంకొల్లు(చినగంజాం) జాతీయ స్థాయిలో నిర్వహించే టీ 20 క్రికెట్ పోటీలకు మండలంలోని నాగండ్ల గ్రామానికి చెందిన బూరగ ప్రేమయ్య ఎంపికయ్యారు. ఈ మేరకు ప్రేమయ్యకు ఆల్ ఇండియా క్రికెట్ డవలప్‌మెంట్ ట్రస్టు నుంచి ఉత్తర్వులు అందాయి. జాతీయ జట్టులో భారతదేశం తరపున క్రికెట్ జట్టులో ప్రేమయ్య బ్యాట్స్‌మన్ ఎంపిక కాగా మే నెల 26 నుంచి 31 వరకు నేపాల్‌లో నిర్వహించే పోటీలలో పాల్గొనున్నట్లు ప్రేమయ్య తెలిపారు. ప్రేమయ్య ప్రస్తుతం నరసరావు పేటలో కృష్ణవేణి డిగ్రీ కాలేజీ నందు డిగ్రీ చదువుతున్నాడు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు మృతి

చీరాల: టూవీలర్‌ను లారీ ఢీకొనడంతో తీవ్రగాయాలై హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వ్యక్తి శనివారం మృతిచెందాడు. ఈనెల 16న పాపాయిపాలెంకు చెందిన రమేష్ బైపాస్ రోడ్డులో వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఒంగోలు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న అతడు శనివారం మృతిచెందాడు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే అందరికీ ఆరోగ్యం

- ఎస్పీ కంచి శ్రీనివాసరావు
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది



ఏఆర్ ప్రాంగణంలోని శుభ్రతలో పాల్గొన్న జిల్లా ఎస్పీ

నరసరావుపేట: మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే అందరూ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు పోలీసు అధికారులు, సిబ్బందికి సూచించారు. ప్రతి మూడో శనివారం పర్యావరణ పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో భాగంగా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది కలిసి తమ కార్యాలయాల్లో పరిశుభ్రత నిర్వహించారు. సబ్ డివిజన్ అధికారుల కార్యాలయాలు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ల కార్యాలయాలు, అన్ని పోలీస్ స్టేషన్లలో శ్రమదానం చేసి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. పోలీసుస్టేషన్ లోపల, ఆవరణలోనూ పరిసరాలను పరిశుభ్రం చేశారు. పిచ్చి మొక్కలను తొలగించారు. ఫైళ్లను క్రమపద్ధతిలో ఉంచారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీతోపాటు ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, వెల్ఫేర్ ఆర్.ఐ గోపీనాథ్, ఏ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు స్వాధీనం



బల్లికురవ: పేలుడు పదార్థాలు నిలువచేసే మ్యాగ్జెయిన్‌లను పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. వేమవరం జంక్షన్ నుంచి గంగపాలెం వెళ్లే రోడ్డుతో పాటు, నాగరాజుపల్లె సమీపంలో ప్రసన్నాంజనేయ ఫ్యాక్టరీలో అక్రమంగా నిల్వ ఉంచిన 2300 మ్యాగ్జెయిన్ ముడి సరుకును స్వాధీనం చేసుకున్నట్లు సంతమాగులూరు సీఐ వెంకట్రావు తెలిపారు. దాడుల్లో బల్లికురవ ఎస్సై వై. నాగరాజు, ఆర్‌ఐ పోతురాజు పాల్గొన్నారు.

